# ★ పెళ్ళయ్యాక చూడు ★

## బొమ్మ

పదేళ్ళప్పుడు చిట్టి పక్కింటి మాష్టారబ్బాయి దగ్గర ఓ బొమ్మని చూసింది. అలాంటి బొమ్మ తనక్కూడా కావాలని మారాం చేసింది ఇంట్లో.

చిట్టి వాళ్ళనాన్న వెంటనే పదిరూపాయలు పెట్టి అలాంటి బొమ్మని కొనిచ్చాడు చిట్టికి.

చిట్టికి ఆ బొమ్మే ప్రపంచం.

దానికి చిన్నచిన్న బూట్లు, షర్టూ పాంటూ తొడిగి చూసుకు చూసుకు మురిసిపోయేది చిట్టి.

ఆ బొమ్మ చిట్టి చెప్పినట్లు వినేది.

కీ ఇస్తే చాలు మెట్టూ పల్టీలు కొట్టేది.

చిట్టి ఆనందంతో చప్పట్లు కొట్టేది.

*　　　*　　　*

చిట్టికి ఈడొచ్చింది.

చిట్టి అడక్కుండానే వాళ్ళ నాన్న పదివేల రూపాయలు పెట్టి ఖరీదైన బొమ్మను కొనిచ్చాడు చిట్టికి.

కానీ—

చిట్టి ఆ బొమ్మతో ఆడుకోదు. ఆ బొమ్మే కావాలన్నప్పుడల్లా ఇష్టం వచ్చినట్టు చిట్టితో ఆడుకొంటుంది.

ఆ బొమ్మ చిట్టి చెప్పినట్టు వినదు-తాను చెప్పినట్టే చిట్టి వినాలంటుంది.

అవును ఆ బొమ్మకి ప్రాణం వుంది'
మనసు లేదు''

## ఇంటికి దీపం

కళ్ళలో కాంతి—మనసులో కోరికలతో అత్తింట అడుగు పెట్టింది చిట్టి.

మా ఇంటి మహాలక్ష్మివన్నారు చిట్టిని వాళ్ళ అత్తమామలు.

చిట్టి ముఖంలో వెలుగురేఖలు తళుక్కుమనేవి.

మా ఇంటి దీపానివి అనేవాడు భర్త.

చిట్టి ఆనందంతో పరవశించిపోయేది. గువ్వలా భర్త కౌగిటిలో ఇమిడిపోయేది.

*　　　*　　　*

చిట్టికిప్పుడు ముప్ఫయ్యేళ్ళు. ఇద్దరుపిల్లల తల్లి.

కళ్ళలో కాంతిలేదు—చీకటే తప్ప.

ఆమె మనసులో కోరికలు లేవు—కలతలే తప్ప.

"మా ఇంటి దీపానివి" అని భర్త తనని ఎప్పుడేనా అంటే చిట్టి ముఖంలో ఓ విషాద రేఖ కనిపిస్తుంది.

"అవును దీపం అవసరం రాత్రే. రాత్రంతా వాడుకొన్న దీపాన్ని పగలు యే మూలకో నెట్టేస్తారు. విద్యుద్దీపాన్నయితే స్విచ్చి నొక్కి ఆర్పేస్తారు. నా బ్రతుకూ అంతే—" అనుకొంటుంది.

## శిల్పం

"చిట్టీ నువ్వు నవ్వుతుంటే ముత్యాల వర్షం కురుస్తున్నట్టుంది-నిజం"—

చిట్టి తన నవ్వు ముఖానికి చేతిని అడ్డం పెట్టుకొని భర్తకేసి కొంటెగా చూసేది.

"చిట్టీ నువ్వు నడుస్తుంటే ఖజురహో శిల్పం ప్రాణం పోసుకొని నా ఎదుట నాట్యం చేస్తున్నట్టుంది-తెలుసా!"

చిట్టి నడకలో మరింత హొయలు నింపుకొని అక్కణ్ణించి కదిలి వెళ్ళిపోయింది కవ్వింపు ధోరణిలో.

*　　　*　　　*

ఏళ్ళు గడిచిపోయాయి.

బ్రతుకులో సారం పేదరికపు బాధల గాడ్పులకి ఇగిరిపోక తప్పలేదు.

చిట్టి ఇప్పుడు మనసునిండా హాయిగా నవ్వదు. నవ్వినా "ఏమిటా పోకిరి నవ్వులు?" అంటాడు భర్త.

చిట్టి ఇప్పుడు ఖజురహో శిల్పం కదిలి వచ్చినట్టు నడవదు. నడిచినా "ఏమిటా హంస నడకలు-" అని చిరాకుపడతాడు భర్త.

★ పి. శ్రీనివాసశాస్త్రి ★